అక్షర
# దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
గురువారం 10, ఏప్రిల్ 2025 | సంపుటి :02 | సంచిక :54 | పేజీలు :05

## కక్కుర్తి ఖాకీ..



- ఏసీబీ వలకు చిక్కుతున్న లంచగొండి పోలీసులు
- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోతున్నా మారని ఆఫీసర్లు
- మొన్న చింతలపాలెం ఎస్సై అంతిరెడ్డి..
- ఇవాళ భద్రాచలం సీఐ, కానిస్టేబుల్..
- రూ. 20 వేలు తీసుకుంటూ దొరికిపోయిన వైనం

4లో..


## రేపు మెగా జాబ్ మేళా..



- వరంగల్‌లోని ఎంకే నాయుడు హోటల్ వేదిక
- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపు

3లో..

# హెల్త్‌కార్డులతో నయా దందా!



### ప్రభుత్వ నిబంధనలకు పాతరేసిన ఓ దవాఖాన

- హన్మకొండ కాకాజీ కాలనీలో యథేచ్ఛగా నిర్వహణ
- ఫీజులో 50 శాతం రాయితీ అంటూ ప్రకటనలు
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు
- ప్రైవేట్ దవాఖానల హెల్త్ స్కీములతో ఆరోగ్య భద్రతకు ముప్పు
- లేని రోగాలు అంటగట్టే ప్రమాదం ఉందంటూ నిపుణులు హెచ్చరిక
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటూ ప్రజల డిమాండ్
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు

వరంగల్ మహా నగరంలో ప్రైవేట్ దవాఖానల దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా దోపిడీకి తెగబడుతున్నారు కొందరు వైద్యులు. రోజుకో కొత్త తరహా మోసాలతో పేద, మధ్యతరగతి వర్గాలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి ఘటనే హన్మకొండలో తాజాగా వెలుగులోకి వచ్చింది. హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు మినహా ప్రైవేట్ దవాఖానలు ఎలాంటి హెల్త్ కార్డులు జారీ చేయకూడదన్న నిబంధనలను బేఖాతర్ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యహరిస్తోంది హన్మకొండ కాకాజీకాలనీలోని ఓ దవాఖాన. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే కుటుంబం మొత్తానికి ఆరోగ్య కార్డు అందిస్తామంటూ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హాస్పిటల్ యాజమాన్యం స్వతహాగా హెల్త్ కార్డు ఇవ్వడం చట్టపరంగా, నైతికంగా, ప్రజాహితంగా సమస్యాత్మకమని, హెల్త్ కార్డుల జారీ విషయంలో ప్రజలు పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్య నిపుణులు. ప్రభుత్వ ప్రామాణికత లేకుండా, ఆమోదించని హెల్త్ స్కీములు ప్రవేశపెట్టడం ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

2లో..



### భూపాలపల్లి మున్సిపాలిటీకి

## ఆదాయ మార్గాలను పెంచుకోవాలి

- అంబేడ్కర్, జయశంకర్, గణేష్ చౌక్, మంజూరునగర్ సర్కిళ్ల విస్తరణ పనులు చేపట్టండి
- మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే జీఎస్సార్

4లో..



### డాక్టర్ సాహిత్ కు

## డిగ్రీ పట్టా

పలువురు శుభాకాంక్షలు

4లో..

## బడులు బంద్

- ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న పున: ప్రారంభం






## యంగ్ ఇండియా నా బ్రాండ్

- ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయ్‌మెంట్‌కే ప్రధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభం

2లో..

గురువారం
10.04.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

## హెల్త్ కార్డులతో

# నయా దందా !



- ప్రభుత్వ నిబంధనలకు పాతరేసిన ఓ దవాఖాన
- హన్మకొండ కాకాజీ కాలనీలో యథేచ్ఛగా నిర్వహణ
- ఫీజులో 50 శాతం రాయితీ అంటూ ప్రకటనలు
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు
- ప్రైవేట్ దావాఖానల హెల్త్ స్కీములతో ఆరోగ్య భద్రతకు ముప్పు
- లేని రోగాలు అంటగట్టే ప్రమాదం ఉందంటూ నిపుణులు హెచ్చరిక
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటూ ప్రజల డిమాండ్
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: వరంగల్ మహా నగరంలో ప్రైవేట్ దవాఖానల దందాకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా దోపిడీకి తెగబడుతున్నారు కొందరు వైద్యులు. రోజుకో కొత్త తరహా మోసాలతో పేద, మధ్యతరగతి వర్గాలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి ఘటనే హన్మకొండలో తాజాగా వెలుగులోకి వచ్చింది. హెల్త్ ఇన్యూరెన్స్ కంపెనీలు మినహా ప్రైవేట్ దవాఖానలు ఎలాంటి హెల్త్ కార్డులు జారీ చేయకూడదన్న నిబంధనలను భేఖాతర్ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యహరిస్తోంది హన్మకొండ కాకాజీకాలనీలోని ఓ దవాఖాన. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే కుటుంబం మొత్తానికి ఆరోగ్య కార్డు అందిస్తామంటూ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హాస్పిటల్ యాజమాన్యం స్వతహాగా హెల్త్ కార్డు ఇవ్వడం చట్టపరంగా, నైతికంగా, ప్రజాహితంగా సమస్యాత్మకమని, హెల్త్ కార్డుల జారీ విషయంలో ప్రజలు పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్య నిపుణులు. ప్రభుత్వ ప్రామాణికత లేకుండా, ఆమోదించని హెల్త్ స్కీములు ప్రవేశపెట్టడం ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధం..

హన్మకొండలోని కాకాజీకాలనీలోని హాస్పిటల్ కొత్త తరహా దందాకు తెరలేపిందన్న ఆరోపణలు వస్తున్నాయి. యాజమాన్యం కొంతకాలంగా హెల్త్ కార్డులను జారీ చేస్తోంది. కేవలం రూ. 299 చెల్లించి మొత్తం కుటుంబ సభ్యులు డిస్కౌంట్ పొందవచ్చని, పేషెంట్‌కు ఆర్థికంగా లబ్ధి చేకూర్చడమే తమ లక్ష్యమని ప్రకటనలిస్తోంది. కార్డు తీసుకున్న తేదీ నుంచి మూడు సంవత్సరాల కాల పరిమితి వర్తిస్తుందని చెబుతున్నారు. కార్డు తీసుకున్న వారికి ఓపీ ఫీజులో 50 శాతం, మెడికల్ షాపు 10 శాతం, లాబ్ 50 శాతం, ఎక్స్‌రే, సిటి స్కాన్, యూఎస్‌జీ, ఎంఆర్ఐ 30 శాతం.. అన్ని రకాల అడ్మిషన్లు, ఆపరేషన్లలో 30 శాతం డిస్కౌంట్ ఇస్తామని కరపత్రాలతో ప్రచారం చేస్తున్నారు. ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, పల్మనాలజీ, పిడియాట్రిక్, రేడియేషన్ ఆంకాలజిస్టులకు సంబంధించిన వైద్యసేవలు అందిస్తామని పేర్కొంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రైవేట్ దవాఖానలు ఎక్కడా కూడా స్వతహాగా హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు జారీ చేయకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నా రకరకాల ఆఫర్ల పేర హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు ఇస్తున్న సదరు దవాఖాన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### లాభం కంటే నష్టమే ఎక్కువ..

ఏదైనా హాస్పిటల్ యాజమాన్యం స్వతహాగా హెల్త్ ఇన్యూరెన్స్ కార్డు ఇవ్వడం చట్టపరంగా, నైతికంగా, ప్రజాహిత పరంగా సమస్యాత్మకమే అంటున్నారు వైద్య నిపుణులు. ఇన్సూరెన్స్ లేదా హెల్త్ స్కీమ్ లాంటి సేవలు అందించడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (IRDAI) అనుమతి అవసరమని, ఆసుపత్రులు తమ సొంతంగా ఇన్సూరెన్స్ విధానాలను ప్రారంభిస్తే, అది చట్టపరంగా అనుమతించబడదని అంటున్నారు. ఒక హాస్పిటల్ తనకు తానే ఇన్సూరెన్స్ స్కీమ్ కల్పిస్తే, ఖర్చులు ఎంత, చికిత్స నిజంగా అవసరమా అనే విషయంలో నిర్వాహకులు తాము ఇష్టానుసారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది రోగికి ఆర్థికంగా, ఆరోగ్యంగా నష్టం కలిగించవచ్చని పేర్కొంటున్నారు. అంతేగాక కుటుంబానికి ఒకే హెల్త్ కార్డు వంటి ప్రకటనలతో ప్రజలను ఆకర్షించడం తప్పుదోవ పట్టించే ప్రచారమని, అధికారికంగా ఆ ప్రమాణాలు లేకపోతే, ప్రజలు మోసపోతారని హెచ్చరిస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటల్ ఇచ్చే స్వంత హెల్త్ కార్డుకు ప్రభుత్వపరంగా ఏ భద్రతా హామీ ఉండదని, రోగి హక్కులు ఉల్లంఘించే అవకాశం ఉంటుందని, ఫిర్యాదు చేస్తే పరిష్కారం కూడా దక్కకపోవచ్చని, అందువల్ల హెల్త్ కార్డుల విషయంలో ప్రజలు పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రైవేట్ హెల్త్ ఇన్యూరెన్స్ కార్డులతో రోగులు చివరికి ధన, ప్రాణ నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అలాంటి కార్డులు జారీచేస్తున్న హాస్పిటళ్లపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

## ‘యంగ్ ఇండియా’

# నా బ్రాండ్

- ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయ్ మెంట్ కే ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభం

అక్షరదర్బార్, హైదరాబాద్: గత ముఖ్యమంత్రులకు వేరువేరు బ్రాండ్‌లు ఉండొచ్చు కానీ తన బ్రాండ్ మాత్రం ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పోలీసుల పిల్లల కోసం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో నిర్మించిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖతో తనకు ఆప్యాయ బంధముందన్న సీఎం, వారి పిల్లల విద్య పట్ల స్పష్టమైన వైఖరి ఉందని తెలిపారు. భారతదేశంలోని యువత ప్రపంచ స్థాయిలో సగర్వంగా నిలబడాలనేదే తన లక్ష్యమని పేర్కొన్నారు. అందులో తెలంగాణ వారు ముందుండాలని ఆకాంక్షించారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమ ప్రభుత్వం కంకణబద్ధమై ఉందన్న ముఖ్యమంత్రి, సైనిక్ స్కూల్, ఆర్మీ స్కూల్‌తో పోటీ పడే విధంగా పోలీస్ స్కూల్ తయారవ్వాలని సూచించారు. అందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. నగరంలోని ఐటీ, ఫార్మా కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధులు సేకరించాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. పాఠశాల నిర్మాణం నుంచి పిల్లల యూనిఫామ్ వరకు ప్రతిదాంట్లో సీఎం ప్రత్యేక చొరవ చూపించారని డీజీపీ జితేందర్, నగర కమిషనర్ సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు.

## వాహనాలను తీసుకెళ్లండి

### సీపీ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హన్మకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లుగా వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను హనుమకొండ భీమారం, సి.ఆర్ పి. ఎఫ్ కేంద్రంలో భద్రపర్చారు. వాటిని పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి సబంధిత వాహన యజమానులకు నోటీసులు కూడా పంపారు. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహనాలను తిరిగి అంద జేయనున్నారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్లు 8712685143, 8712685158, 87125 84557 యజమానులు సంప్రదించాలని సీపీ ఒక ప్రకటనలో తెలిపారు.

## బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

- శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి..
- తల్లి మరణించడంతో దుబాయ్ నుంచి స్వదేశానికి..
- పలు కేసుల్లో విచారించనున్న పోలీసులు




అక్షరదర్బార్, హైదరాబాద్ : బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. వివిధ కేసుల్లో అరెస్ట్ వారెంట్ జారీ కాగా కొంతకాలంగా ఆయన దుబాయ్‌లోనే ఉంటున్నాడు. అయితే షకీల్ తల్లి అనారోగ్యంతో కన్నుమూయగా, అంత్యక్రియల కోసం హైదరాబాద్‌కు వచ్చారు. మాజీ ఎమ్మెల్యే వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు శంషాబాద్ విమానాశ్రయంలోనే ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. తల్లి అంత్యక్రియలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా పోలీసులు అంగీకరించారు. అంత్యక్రియలు ముగిసిన వెంటనే షకీల్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### కొంతకాలంగా దుబాయ్ లోనే..

ఇప్పటికే పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేయనున్నారు. ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులను మేనేజ్ చేసి తన కుమారుడిని కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేశారంటూ షకీల్‌పై గతంలోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో అతనిపై కూడా కేసు నమోదు అయ్యింది. కేసు నమోదు విషయం తెలిసిన షకీల్ ఇండియాకు రాకుండా దుబాయ్‌లోనే ఉండిపోయారు. ఇప్పుడు ఇండియాకు వచ్చాక ఎయిర్‌పోర్టు అధికారులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని షకీల్‌ను అరెస్ట్ చేశారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.



## సన్న బియ్యం పంపిణీలో అక్రమాలను సహించం..

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : పేద, ధనిక అనే తేడా లేకుండా ఉండాలనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకొచ్చిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల మండలం పోచారం గ్రామంలో కోడెపాక సంపత్ రాణి ఇంట్లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ప్రజలు సన్నబియ్యం తీసుకుని సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు తావులేదని అన్నారు.




## మాతా, శిశు మరణాలను తగ్గించాలి

### ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయప్రద

అక్షర దర్బార్, చిట్యాల : అంగన్వాడి సెంటర్ల పరిధిలో మాతా, శిశు మరణాలను తగ్గించే విధంగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద కోరారు. చిట్యాల మండలం జడల్ పేటలో ఐదుగురు అంగన్వాడీలు, ఆయాలు గురువారం ఏర్పాటు చేసిన పోషణ పక్షం సమావేశానికి జయప్రద హాజరై మాట్లాడారు. మాతా,శిశు మరణాలను తగ్గించడంలో టీచర్ల పాత్ర ప్రాముఖ్యమైనదని అన్నారు. మెడికల్ ఆఫీసర్ మౌనిక మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం వాసంతి, అంగన్వాడీ టీచర్స్ వసంత సుజాత సాధన రాణి మమత రమ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం జై హీరా బేగం ఏఎన్ఎం లహరి కార్యదర్శి రమ్య పాల్గొన్నారు.

# జాబ్‌మేళా ఏర్పాట్లు పరిశీలన

- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఈనెల 26న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్ లో జరిగే మెగా జాబ్ మేళాకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. జాబ్ మేళాకు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు పది వేల నుండి పదిహేను వేల మంది నిరుద్యోగ అభ్యర్థులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. టాస్క్ ప్రతినిధులను సమన్వయం చేసుకుని స్టాల్స్, రిజిస్ట్రేషన్ సెంటర్స్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు వచ్చే యువతీ, యువకులు ఇంటర్వ్యూలో పాల్గొనేలా సరిగా గైడ్ చేసేలా వాలంటీర్లను నియమించాలని సింగరేణి జీఎం ను కోరారు. దూర ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులకు తాగునీరు, మజ్జిగ పాకెట్స్, భోజన వసతి అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా, అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయం చేసుకుని జాబ్ మేళాను సక్సెస్ చేయాలని ఎమ్మెల్యే అన్నారు.

## బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



అక్షరదర్బార్, నూగూరు వెంకటాపురం: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ భద్రాద్రికొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యుడు గన్నూరి రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఆవరణలో క్రియాశీలక సభ్యుల సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా గన్నూరి రమణ హాజరై మాట్లాడారు. ఏప్రిల్ 11, 12 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు విస్తృతంగా పర్యటించి రాబోయే ఎన్నికల నాటికి బీజేపీని పటిష్ఠం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రఘురాం, కౌన్సిల్ మెంబర్ బొల్లె సునీల్, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ సేవలందిస్తేనే చిరకాలం గుర్తింపు

- నర్సంపేట బ్లాక్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగం శివాజీ

అక్షర దర్బార్, దుగ్గొండి : ఉద్యోగరీత్యా తను ఎంచుకున్న రంగంలో ఉత్తమ సేవలందిస్తేనే ప్రజలు చిరకాలం గుర్తించుకుంటారని నర్సంపేట బ్లాక్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగం శివాజీ దుగ్గొండి మండల మల్లిపల్లి గ్రామం అంగన్వాడీ కేంద్రంలో ఆయమ్మగా గత 35 సం"రాలుగా విధులు నిర్వహించిన కశివోజ్జుల రాజేశ్వరి పదవీ విరమణ పొందగా మల్లిపల్లి గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమంలో శివాజీ మాట్లాడుతూ రాజేశ్వరి శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాతరాశి నాగేందర్, సిసి పద్మ, సిఏ వేల్పుల సుజాత , వీవో అధ్యక్షురాలు పొన్నాల సువర్ణ, ప్రధాన కార్యదర్శి ఇనుముల సరిత, డ్యాగం లక్ష్మీబాయి,పొన్నాల రాజేశ్వరి,పులి విజయ,కశివజ్జుల భాగ్య, బోయిని ఐలమ్మ, తలబోయిన మల్లమ్మ, సోనబోయిన మల్లమ్మ, మంజూల, కూకట్ల కోమల , తలారి కర్ణ పాల్గొన్నారు.

# చలివేంద్రాలు ఏర్పాటు







అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని అంగడి బజార్ లో పూర్ణ జ్యువెలర్స్ యజమాని, తొమ్మిదో వార్డ్ మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కుంకుమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, నాగబండి జ్ఞానానందం, వెనిశెట్టి శ్యామ్, పూలమాటి సదానందం నూక సురేష్, కేశవ రెడ్డి, కానుగుల గోపి నాథ్, రాజు, శివ, రమేష్, అభిలాష్ , వెంకటేశ్వర్లు , రామకృష్ణ , బాలకృష్ణ , సందీప్,సూర్య ప్రకాష్ , భిక్షపతి, సిద్ధు పాల్గొన్నారు.

### అలియాబాద్ గ్రామంలో..

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం అలియాబాద్ గ్రామంలో గురువారం రోజు మాజీ పోలీస్ అధికారి శాతరాశి సుధాకర్ రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శాతరాశి సనత్ కుమార్ పటేల్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పరకాల ఎస్సై శివకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ తాజా మాజీ సర్పంచ్ శాతరాశి రమాదేవి సుధాకర్ రావు, తాజా మాజీ ఉప సర్పంచ్ డ్యాగా శ్రీనివాసరావు, యూత్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శివాలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం నవాబుపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఏలేటి రామయ్య పల్లి గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు ఏలేటి నర్సయ్య, లింగమ్మ, ముత్తమ్మ గార్ల జ్ఞాపకార్థం కొత్తూరు వెంకటమ్మ – స్వామీరెడ్డి కొత్తూరు మల్లారెడ్డి – హేమ, కొత్తూరు నర్సింహా రెడ్డి(డాక్టర్) – శిరీష , కొత్తూరు విజందర్ రెడ్డి – సుష్మ దంపతులు కలిసి శివాలయానికి విరాళంగా రూ.216000 ఇచ్చారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ సభ్యులు ఆలయ కమిటీ అధ్యక్షులు కసిరెడ్డి రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మోతుకూరి నరేష్, బిళ్ళ సత్యనారాయణ రెడ్డి, మందల రాఘవరెడ్డి, కాల్వ సమ్మిరెడ్డి, బొమ్మ శంకర్, కొక్కుల సారంగం, మోతుకూరి రాజు, చెక్క నర్సయ్య, సర్వ శరత్, తీగల నాగరాజు, అనగాని రాజయ్య, తిప్పణవేణి రవి, ప్రధాన అర్చకులు రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## 6 బాల్స్ 6 సిక్స్ లు..


### చిట్యాల సిసిపిఎల్-3 లో రికార్డు

### ఒకే ఓవర్ లో 41 రన్స్

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో నడుస్తున్న సీసీపీఎల్–3 క్రికెట్ టోర్నమెంట్ లో రైజింగ్ స్టార్ బౌలర్ మనీష్ వేసిన ఓవర్లో ఆరు బాళ్లకు ఆరు సిక్స్ లు కొట్టి ఈగల్ వారియర్స్ బ్యాట్స్ మెన్ నేపాలి రాజేష్ చరిత్ర సృష్టించాడు. ఒకే ఓవర్ లో ఒక నోబాల్ తో కలిపి మొత్తం 41 రన్స్ చేశారు. చిట్యాల క్రికెట్ ఆటల చరిత్రలో ఈ ఘనతను సాధించిన రాకేష్ ను పలువురు అభినందించారు.



## నూతన వధూవరులకు ఆశీర్వాదం



అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త వినయ్–కళ్యాణి వివాహానికి హాజరై నూతన వధూవరులను బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆశీర్వదించారు. ఆయన వెంట మండల నాయకులు కుసుంబ సుందర్, కదం రాజు, గుండ మణి కుమార్ పాల్గొన్నారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# అప్పు తీర్చాలని ఎరువుల వ్యాపారి ఒత్తిడి

- మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన రైతు

అక్షరదర్బార్, వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన మిర్చి రైతు బొగటా నరసింహారావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుల మందు తాగిన ఆయన అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రైతు నరసింహారావు రెండు ఎకరాలలో మిర్చిపంట సాగు చేశాడు. ఇందుకు ఇదే గ్రామానికి చెందిన ఓ ఎరువుల వ్యాపారి వద్ద రూ.90వేలు అప్పుగా తీసుకున్నాడు. మూడేళ్లుగా మిర్చి దిగుబడి లేకపోవడం, ఈ ఏడాది మిర్చికి ధర లేకపోవడంతో అప్పు తీర్చలేకపోయాడు. వ్యాపారి ఒత్తిడి భరించలేక 15 బస్తాల మిర్చి ఇస్తానని, మిగతావి మరుసటి ఏడాది ఇస్తానని రైతు చెప్పాడు. అయితే ఆ వ్యాపారి వినకుండా కల్లంలో ఉన్న మిర్చి బస్తాలను ట్రాక్టర్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. పంట మొత్తం వ్యాపారి తీసుకెళ్లడంతో మిగిలిన వారి అప్పులు తీర్చడం కష్టమని రైతు నరసింహారావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



# సీపీని కలిసిన అటవీ, ఎక్సైజ్ అధికారులు

అక్షరదర్బార్, హనుమకొండ: అటవీశాఖ వరంగల్ జిల్లా అధికారి అనొజ్ అగర్వాల్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు గురువారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.



# పోషకాహారం తీసుకోవాలి

## ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

అక్షర దర్బార్, పరకాల : మహిళలు పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. గురువారం పోచారం గ్రామ అంగన్వాడీ సెంటర్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. మహిళలు రక్తహీనత కలుగకుండా పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రాణి, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి , మంజుల, శాంత, తల్లులు పాల్గొన్నారు.

# కక్కుర్తి ఖాకీ..

- ఏసీబీ వలలో లంచగొండి పోలీసులు
- రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోతున్నా మారని ఆఫీసర్లు
- మొన్న చింతలపాలెం ఎస్సై అంతిరెడ్డి..
- ఇవాళ భద్రాచలం సీఐ, కానిస్టేబుల్..
- రూ. 20 వేలు తీసుకుంటూ దొరికిన వైనం



అక్షరదర్బార్, భద్రాచలం: తెలంగాణలో ఏసీబీ ఎన్ని కేసులు నమోదు చేసినప్పటికీ అవినీతి అధికారుల పంథా మారడంలేదు. నిత్యం అవినీతి నిరోధక శాఖ దాడులు కొనసాగుతున్నా ఖాకీలు కక్కుర్తి వీడటంలేదు. లంచం తీసుకుంటూ కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలు దొరికిపోతున్న ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నాయి. తాజాగా రూ. 20 లంచం తీసుకుంటూ భద్రాచలం సీఐ రమేష్‌తో పాటు కానిస్టేబుల్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. లారీ డ్రైవర్‌ను లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో వలపన్ని పట్టుకున్నట్లు సమాచారం.

## జనవరి 5న తొర్రూరు సీఐ జగదీష్..

రేషన్ బియ్యం పట్టుబడిన కేసులో వ్యాపారిని తొర్రూరు సీఐ డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో 2024 అక్టోబర్ 2న రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి సీజ్ చేశారు. సీజ్ చేసిన లారీని విడిచి పెట్టేందుకు తొర్రూరు సీఐ జగదీశ్ బియ్యం వ్యాపారిని రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. వ్యాపారి రూ.2 లక్షలు 2024 అక్టోబర్ 3న అందజేయగా, మరో రూ. 3 లక్షల కోసం సీఐ డిమాండ్ చేయడంతో బియ్యం వ్యాపారి ఏసీబీని ఆశ్రయించారు. విచారించిన అధికారులు సీఐ జగదీశ్ అవినీతి ఆరోపణలు నిర్ధారించుకొని జనవరి 5న కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

## పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న ..

నిందితులను కేసు నుంచి తప్పించడానికి లంచం తీసుకుంటూ వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న అవినీతి నిరోధక శాఖ అధికారులకు గత సంవత్సరం ఆగస్టు 2న చిక్కాడు. బెల్లం లోడుతో వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను తప్పించేందుకు ఎస్సై వెంకన్న రూ.70వేలు డిమాండ్ చేశారు. అదే రోజు రూ.20వేలు తీసుకొని వారిని వదిలేశాడు. స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు మరో రూ.50వేలు డిమాండ్ చేయడంతో బెల్లం వ్యాపారి ఏసీబీని ఆశ్రయించాడు. అధికారుల పథకం ప్రకారం రూ.40వేలు ఇస్తామని ఎస్సైకి ఫోన్ చేయగా ఆయన తన డ్రైవర్ కు ఇవ్వాలన్నాడు. డ్రైవర్‌కు డబ్బులివ్వడంతో ఆ మొత్తం తీసుకుని ఎస్సై ఆఫీసుకు వెళ్లగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్సై, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## మొన్న చింతలపాలెం ఎస్సై అంతిరెడ్డి

సూర్యాపేట జిల్లా చింతలపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ అంతిరెడ్డి మంగళవారం ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చింతలపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదయింది. వీరిలో ఓ వ్యక్తితో ఎస్ఐ అంతిరెడ్డి స్టేషన్ బెయిల్ ఇస్తానని బేరం ఆడాడు. రూ. 15 వేలు డిమాండ్ చేయగా చివరకు పది వేలకు బేరం కుదిరింది. కాగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించి సమాచారం అందించాడు. ఈక్రమంలోనే రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా ఎస్సైని అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు.

## జనవరిలో తిరుమలగిరి ఎస్సై, కానిస్టేబుల్ ..

జనవరి 28న సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజును ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రైస్ కేసులో ఎస్ఐ సురేష్ ఓ వ్యాపారిని మూడు లక్షల డిమాండ్ చేశారు. అయితే 1. 30 వేలు ఇచ్చేందుకు వ్యాపారి అంగీకరించి ఏసీబీని ఆశ్రయించాడు. ఈక్రమంలోనే రూ. లక్ష లంచం తీసుకుంటుండగా ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

# అన్ని ఆదాయ మార్గాలను సద్వినియోగం చేసుకోవాలి

- అంబేద్కర్, జయశంకర్, గణేష్ చౌక్, మంజూరునగర్ సర్కిళ్లను విస్తరించాలి
- ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలి
- వేసవిలో తాగునీటి సమస్య ఉండొద్దు
- సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మున్సిపాలిటీకి వచ్చే అన్ని ఆదాయ మార్గాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని పట్టణ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్లో మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ గారి అధ్యక్షతన అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మున్సిపల్ పరిధిలో ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని 30 వార్డుల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నూరు శాతం పన్ను వసూలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. భూపాలపల్లి పట్టణాన్ని సుందరంగా, ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేసుకావాలని అన్నారు. ముఖ్యంగా పట్టణంలో అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, గణేష్ చౌక్, మంజూరునగర్ సర్కిళ్లను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలని కోరారు. వేసవి దృష్ట్యా మునిసిపాలిటీలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల్లో పురోగతి లేదని, సదరు గుత్తేదారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బుద్దారం నుండి కొడవటంచ, పందిపంపుల నుండి దూదేకులపల్లి, సింగారం నుండి దూదేకులపల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు అటవీ అనుమతులు తీసుకుని, ఆ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఫారెస్ట్ , ఆర్ అండ్ బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.





# డాక్టర్ సాహిత్ కు డిగ్రీ పట్టా అందజేత

- పలువురు శుభాకాంక్షలు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండకు చెందిన డాక్టర్ మట్టపెల్లి సాహిత్ హైదరాబాద్ లోని గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసుకుని డిగ్రీ పట్టా పొందారు. ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ మట్టపెల్లి సంపత్ రావు, శోభ దంపతుల కుమారుడు సాహిత్ గాంధీ మెడికల్ కళాశాలలో విజయవంతంగా ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గురువారం గాంధీ మెడికల్ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో సాహిత్ డాక్టర్ మట్టపెల్లి సాహితి డిగ్రీ పట్టా అందుకున్నారు. డిగ్రీ పట్టా అందుకున్న డాక్టర్ మట్టపెల్లి సాహిత్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- నష్టపోయిన పంటకు ఎకరాకి రూ.25 వేలు చెల్లించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- హరిపిరాలలో నేలకొరిగిన వరి పొలాలు పరిశీలన



అక్షర దర్బార్,తొర్రూరు : రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ధ్వజమెత్తారు. మండలంలోని హరిపిరాల గ్రామానికి చెందిన కూన వెంకన్న అనే రైతు పది ఎకరాల పంట పొలం వేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు తాను నష్టపోయానని తన గోడు వెల్లబోసుకున్నారు. స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాక ర్ రావు గురువారం రైతు పంటపొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ... ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఇప్పటికే మోసపోయారని, న ష్టపోయిన రైతులకు ఎలాగైతే రూ.25,000 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశామో, అదేవిధంగా వడగండ్ల వానకు నష్టపోయిన పంట పొలాలకు రూ.25,000 వేల నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతు సంక్షేమం కోసం కేసీఆర్ రైతుబంధు, సాగునీరు, పంట నష్టం ఇచ్చి ఆదుకుంటే ఈ ప్రభుత్వం కనీసం రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులను ఆదుకోవాలని కోరారు.



## భూకబ్జాదారులు ఎమ్మెల్యే దొంతిని విమర్శించడం హాస్యాస్పదం

**నల్లబెల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి**

అక్షర దర్బార్, నల్లబెల్లి : నరహంతక నహీం ముఠా సభ్యుడు, భూకబ్జాదారుడు కూడా ఎమ్మెల్యే దొంతిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని నల్లబెల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం నల్లబెల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లబెల్లి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఇంకా బీఆరెస్ ప్రభుత్వమే ఉందనే భ్రమలోనే బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

## ముత్తారంలో హనుమాన్ శోభాయాత్ర

**-ఇంటింటికి జై శ్రీరామ్ నినాదం**



అక్షర దర్బార్, భీమదేవరపల్లి: ఈనెల 12 న, (శనివారం) హనుమాన్ జయంతి సందర్భంగా ముత్తారం గ్రామంలో మొట్టమొదటిసారిగా హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్రికుటేశ్వర ఆలయం నుండి సా. 6 గం.లకు ఆంజనేయుని శోభా యాత్ర ప్రారంభం కానుంది. మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో హనుమాన్ దీక్షాపరులు హాజరుకానునట్లు నిర్వాహకులు తెలిపారు. అర్చకులు కోటేశ్వరచారి ఆలయంలో శోభాయాత్రకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఇంటింటికి జై శ్రీరామ్ నినాదాన్ని తీసుకెళ్లి, విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# 24 నుంచి బడులు బంద్

- జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న పున: ప్రారంభం

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎండలు తీవ్రంగా మండుతున్న నేపథ్యంలో స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించింది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు సెలవులు ఉండనున్నాయని విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. పాఠశాలలు తిరిగి జూన్ 12న ప్రారంభం కానున్నాయి. ఇటీవల వేసవి సెలవులపై సోషల్ మీడియాలో, ఇతర వేదికల్లో రకరకాల ఊహాగానాలు, తప్పుడు సమాచారం చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో విద్యాశాఖ ఈ ప్రకటనతో స్పష్టతనిచ్చింది. ఈ షెడ్యూల్‌ను తెలంగాణ అకడమిక్ క్యాలెండర్ 2024-25 ప్రకారమే నిర్ణయించినట్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్కపూట బడుల విధానం అమలులో ఉంది. ఉదయం మాత్రమే పాఠశాలలు కొనసాగుతున్నాయి. అయితే, వేసవి సెలవులు రాగానే మొత్తం 45 రోజులకుపైగా పాఠశాలలు మూతపడనున్నాయి. దీనివల్ల విద్యార్థులకు వేసవిలో విశ్రాంతి లభించనుంది.

## డిగ్రీ కళాశాలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేత

అక్షర దర్బార్,తొర్రూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు ఎండి. అమీర్, తొర్రూరు మండల అధ్యక్షుడు కళ్యాణి ఆకాష్ లు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు సీసీ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు మహేష్, మండల నాయకులు ప్రవీణ్, యాకన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిమినల్ కేసు పెట్టడంలో జాప్యమెందుకు

**డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి**



అక్షర దర్బార్, పరకాల : మున్సిపల్ కార్యాలయంలోని రికార్డు గదిలోకి అక్రమంగా చొరబడిన వ్యక్తిపై క్రిమినల్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. రికార్డు గదిలో మాజీ కౌన్సిలర్ జయంతి లాల్ చొరబడి ఏం చేశారు..? విచారణ కమిటీ ఏం తేల్చింది. మున్సిపల్ అధికారులు పూర్తి సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలన్నారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి అయిన జయంత్ లాల్ పై చర్యలకు ఎమ్మెల్యే ఆదేశించినప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు ఎందుకు చేపట్టడం లేదంటూ ఘాటుగా ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు మాజీ కౌన్సిలర్ పై చర్యలు తీసుకోవాలని, లేకుంటే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## రేపు మెగా జాబ్ మేళా..



- వరంగల్ ఎంకే నాయుడు హోటల్ వేదిక
- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి సురేఖ

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్‌లో రేపు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవతో ఏప్రిల్ 11న టాస్క్ సౌజన్యంతో ఏర్పాటు చేయనున్నారు. వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సురేఖ సూచించారు. ఈ మేరకు మంత్రి సురేఖ గురువారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ జిల్లా యువతీ యువకులందరూ మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని, తమ పేరును నమోదు చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరారు. నిర్వాహకులు విడుదల చేసిన పోస్టరులో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు ఎన్ రోల్ చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయం 9:30 గంటల నుండి వరంగల్‌లోని ఎంకే నాయుడు హోటల్స్, కన్వెన్షన్ లో ప్రారంభం అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య**



అక్షర దర్బార్ చిట్యాల : నిరుద్యోగ యువతకు ఈనెల 26న జిల్లా కేంద్రంలోని పుష్ప గార్డెన్ మైసమ్మ గుడి దగ్గర ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య కోరారు. గురువారం ఆయన చిట్యాల మండల కేంద్రంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గంలోని చదువుకున్న యువతి యువకులకు ఉపాధి కల్పించడం కోసం జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915